

పంచాయతీలకు నిధుల వెల్లువ

జిల్లాలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.37.58 కోట్లు విడుదలయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. -10లో..



బడుగుల సంక్షేమమే జగనన్న ధ్యేయం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. -10లో..

గరిష్టం/కనిష్టం
31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

25 నుంచి జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్

త్రిపురాంతకం: రిపబ్లిక్ డే సందర్భంగా బీటీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 25 నుంచి జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాజుపాలెం యూత్ తెలిపారు. త్రిపురాంతకంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు ప్రథమ స్థాయి నుంచి నాలుగు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9182279841, 7569537800, 98855855498 సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పతకాలు సాధించిన విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



బహుమతిని కలెక్టర్‌కు చూపుతున్న విద్యార్థినులు

ఒంగోలు అర్బన్: కార్లింగ్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీల్లో పలు పతకాలు సాధించిన పీవీఆర్ బాలికల హైస్కూలు విద్యార్థినులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మంగళవారం ప్రకాశం భవనంలో ప్రత్యేకంగా అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఝాన్సీ దేవితో పాటు పతకాలు సాధించిన విద్యార్థినులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో కాశ్మీర్‌లోని గుల్మర్గ్‌లో జరిగిన కార్లింగ్ చాంపియన్ షిప్‌లో ఒక రజత పతకం, 5 కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలిని కలెక్టర్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో క్రీడల్లో మరింతగా రాణించి బంగారు పతకాలు జిల్లాకు తీసుకురావాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. విద్యార్థినిలు ధాత్రి, ఫాతిమా, శుభరత్నం, శ్రీలక్ష్మి, జోషిత, మమత, వీ శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన పొగాకును పండించాలి

- పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



రైతులకు రూ.10 వేలు నగదు పత్రాన్ని అందజేస్తున్న బోర్డు చైర్మన్

పొదిలి రూరల్: రైతులు నాణ్యమైన పొగాకును పండించాలని, దానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ అన్నారు. మంగళవారం పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులతో సమావేశం నిర్వహించి వారి పంట నాణ్యత, దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. మంచి నాణ్యమైన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులు బాగా ఉన్నాయన్నారు. గత నెలలో కురిసిన మిచాంగ్ తుఫాన్ వలన నష్టపోయిన పొగాకు రైతులకు బోర్డు ప్రకటించిన పదివేల రూపాయల వడ్డీ రహిత రుణ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న రైతులకు వారి ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి మేలైన నాణ్యతతో కూడిన పొగాకు దిగుబడి చేయాల్సిందిగా రైతులకు సూచించారు. రైతులు పొగాకును వేలం కేంద్రంలోనే విక్రయించారని, బయట వ్యక్తులకు అమ్మరాదన్నారు. తరువాత వేలం కేంద్రంలో ప్రస్తుతం జరుగుతున్న మౌలిక సదుపాయాల నిర్వహణ, నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం కంభాలపాడులో పొగాకు బేరన్ సందర్శించి క్యూరింగ్, ఆకు అల్లకాలను, పొగాకు మండలాలను పరిశీలించారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టాలు బాగా తెలుసన్నారు. కార్యక్రమంలో గుంటూరు రైతు సంక్షేమ నిధి మేనేజర్ బీ మారన్న, ఏఎస్ గిరి రాజ్‌కుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

27న జాబ్‌మేళా

ఒంగోలు సిటీ: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 27న శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ ఉపాధికారి టి.భరద్వాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఒంగోలు వారి ఆధ్వర్యంలో జియో టెలికాం కంపెనీ, ప్లేస్‌మెంట్ డ్రైవ్, కంపెనీలో సేల్స్ ఆఫీసర్, జియో ఫైబర్ ఇంజినీర్, జియో ఫైబర్ అసోసియేట్, జియో పాయింట్ మేనేజర్, ఫీల్డ్ ఇంజినీర్స్ సెక్టార్‌ల్లో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9160797311 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి

నగరంలో బాలినేని శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానగణం

పేదింట గుండె నిండా..

బాలినేనికి బ్రహ్మరథం

- నాలుగు గంటలకుపైగా భారీ ర్యాలీ
- అడుగడుగునా నీరాజనం
- వచ్చేనెల పదో తేదీలోగా సీఎం జగన్ చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- ఇచ్చిన మాటకు కట్టుబడే పోరాటం
- జగన్ దయతో ఫలించిన పేదల కల
- మీ అందరి ఆశీస్సులతో ఆరోసారి గెలుస్తానన్న నమ్మకం
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, మేయర్ గంగాడ సుజాతలను భారీ గజమాలలతో సత్కరిస్తున్న అభిమానులు

రాష్ట్రమంతా జగనన్న కాలనీలు.. కానీ తెలుగుదేశం కుట్రలతో నగరంలోని పేదలు సొంతింటి కలకు దూరమయ్యారు. వారి ఆకాంక్షను నెరవేర్చేందుకు పట్టువిడవక.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి నిధులు విడుదల చేయించుకుని నగరానికి వచ్చిన మాజీ మంత్రి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తమ ఇంటి కలను తీరుస్తున్న అభిమాన నేతను గుండెల్లో దాచుకున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. మంగళవారం సాయంత్రం ఐదు నుంచి రాత్రి 9 గంటల వరకూ భారీ ర్యాలీ జరిగింది. నీ వెంటే మేము అంటూ పేదలతో పాటు వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నేతలు బాలినేనికి అఖండ స్వాగతం పలికారు..తనపై నగరవాసులు చూపిన అభిమానంతో ఆయన తడిసి ముద్దయ్యారు. '' సీఎం జగన్ దయతో పేద ఇళ్ల కల సాకారమ వుతోంది. మీ కోసం నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి..పేదలకు సేవ చేయాలన్నదే నా తపన.... నాకివే ఇవే చివరి ఎన్నికలు.. నా వారసుడు ప్రణీత్‌ను ఆశీర్వదించండి'' అంటూ భావోద్వేగాల నడుమ బాలినేని ప్రకటించారు.

ఒంగోలు: పేదల ఇళ్ల పట్టాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించుకుని మంగళవారం నగరానికి వచ్చిన మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. యువత పెద్ద ఎత్తున బైకులతో వైఎస్సార్‌సీపీ జెండాలు వాహనాలకు కట్టుకుని నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కర్నూల్ రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద ఉన్న వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బాలినేనికి డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి భారీ గజమాలలతో స్వాగతం పలికారు. అనంతరం కర్నూల్‌రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. చర్చి సెంటర్‌కు చేరుకునేందుకు దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. అడుగడుగునా హారతులతో జనం నీరాజనం పలికారు. గజమాలతో స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ''ఒంగోలు బాసు...బాలినేని వాసు'' అన్న నినాదంతో నగరం హోరెత్తింది. ర్యాలీలో తనయుడు ప్రణీత్‌ను పక్కనే ఉంచుకుని ప్రజలకు అభివాదం చేస్తూ వచ్చారు బాలినేని. రాత్రి 9 గంటలకు ర్యాలీ చర్చి సెంటర్‌కు చేరుకుంది. బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పలు కీలక అంశాలను ఆయన ప్రస్తావించారు. 40 రోజుల తరువాత ఒంగోలుకు వచ్చిన తనపట్ల ఇంతటి ప్రేమాభిమానులు చూపించిన మీ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానన్నారు. పేదలకు పట్టాలు ఇస్తానని మాట ఇచ్చానని, అది ఇవ్వలేనప్పుడు రాజకీయాల నుంచి తప్పుకోవడమే ఉత్తమం అని భావించానన్నారు. తనను విశ్వసించిన జనం పట్ల ప్రేమాభిమానాలే కాదని, వారికి ఆర్థికంగా కూడా అండదండలు అందించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అందులో భాగంగానే 40 రోజులుగా ఇంటి పట్టాల డబ్బుల విడుదల కోసం కృషిచేశానన్నారు. మనపై ప్రేమాభిమానాలు చూపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.231 కోట్లు విడుదల చేశారన్నారు. ఫిబ్రవరి పదో తేదీలోగా ఆయన్ను ఒంగోలుకు ఆహ్వానించి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అందరికీ ఒకేచోట ఇస్తే తొక్కిసలాట జరుగుతుందని, ఈ నేపథ్యంలో ప్రతి సచివాలయానికి తానే వచ్చి పట్టాలు పంపిణీ చేస్తానన్నారు. ఇంకా అర్హులెవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నగరంలో పూరిగుడిసె ఉండడానికి వీల్లేదని, ప్రతి ఒక్క ఇల్లు పక్కా ఇంటిగానే ఉండేలా చేస్తానన్నారు. ఒక వైపు పట్టాల పంపిణీ చేపడుతూనే మరో వైపు లే అవుట్లలో రోడ్లు, విద్యుత్ లైన్లు వంటి మౌలిక వసతులు కూడా చేపడుతున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ తాను పేదలకు నివేశన స్థలం ఇచ్చేందుకు కృషిచేస్తుంటే తెలుగుదేశం పార్టీ నేతలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. రాష్ట్రమంతా జగనన్న కాలనీలు ఏర్పాటవుతుంటే టీడీపీ నేతల కుట్రలు, కుతంత్రాలతో ఒంగోలులో పేదలకు అన్యాయం జరుగుతోందన్నారు. నాడు మైనింగ్ వద్దు అంటూ కోర్టును ఆశ్రయించిన వ్యక్తులతోనే.. మరలా అది మైనింగ్ భూమి అని, ఇంటి పట్టాలు ఇవ్వడానికి వీల్లేదంటూ కోర్టులో కేసులు వేయించిన వారికి జీవితాంతం గుర్తుండేలా గుణపాఠం చెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు.

ప్రణీత్‌ను ఆశీర్వదించండి..

తాను ఒంగోలులో చివరిసారిగా పోటీచేయనున్నానని, 6వ సారి గెలిచిన తరువాత ఇక్కడ తన కుమారుడు ప్రణీత్‌రెడ్డి పోటీచేస్తారని బాలినేని ప్రకటించారు. నిధులు విడుదల చేయించుకోవడంలో సక్సెస్ అయ్యామని, ఎంపీగా మాగుంటను కూడా ఖరారు చేసే విషయంలో గట్టిగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. అది కూడా ఖరారవుతుందని ఆశిస్తున్నానన్నారు. తాను ఇంటి పట్టాలు ఇచ్చేది మొత్తం మహిళల పేరుమీదనే కనుక పట్టాతో పాటు చీర కూడా పెట్టి ఇస్తామన్నారు. పట్టాతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇవ్వాలనేది తన ఆకాంక్ష అని, అది కూడా పూర్తిచేసేందుకు మీకు అండగా ఉంటానని బాలినేని హామీ ఇచ్చారు. గత 10 నుంచి 15 సంవత్సరాలుగా జరుగుతున్న భూ ఆక్రమణలపై తొలిసారిగా సిట్ వేయించిన శాసనసభ్యులు ఎవరైనా ఉన్నారు అంటే అది రాష్ట్రంలో తాను మాత్రమే అంటూ స్పష్టం చేశారు. తాను ఒంగోలులో లేనన్నాళ్లు ఎన్నో రకాల వార్తలు, ఊహాగానాలు వచ్చాయని, కానీ అవన్నీ అవాస్తవమని ఇప్పుడు మీకు అర్థం అవుతుందన్నారు. కేవలం పేదలందరికీ ఇంటి పట్టాలకు అవసరమైన డబ్బులు రప్పించే పనిలోనే తాను ఒంగోలుకు రాలేదన్నారు. లేనివారిని ఆదుకుంటే భగవంతుడు మన కుటుంబాన్ని ఆదుకుంటాడని నమ్మే కుటుంబం తమదన్నారు. అందులో భాగంగానే మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. 2024 ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడిద్దామంటూ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ నేడు ఒంగోలు ప్రజలకు ఎంతో శుభదినం అని, రూ.231 కోట్లు సాధించి మీ సొంతింటి కలను నెరవేర్చేందుకు బాలినేని యోధునిలా పోరాడారన్నారు. వై.పాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అంటేనే బడుగు, బలహీన వర్గాల పార్టీ అని మరోమారు నిరూపితమైందన్నారు. నీచ రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీకి చరమగీతం పాడేందుకు ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బాలినేని అయినా, జగన్ మోహన్‌రెడ్డి అయినా చెప్పారంటే చేస్తారంతే అని నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా కుమారి, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, నగర కన్వీనర్ కటారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, రాష్ట్ర కార్యదర్శి లీలాకుమారి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా, నగర నాయకులు గోవర్ధన్ రెడ్డి, జిల్లెళ్లమూడి రమాదేవి, కావాటి రవికుమార్, గొర్రెపాటి శ్రీనివాసులు, బేతపూడి రాజేశ్వరి, చింతగుంట్ల సువర్ణ, పోకల అనూరాధ, కటారి ప్రసాద్, ఘంటా రామానాయుడు, బాలిశెట్టి నాగేశ్వరరావు, కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కేవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



చెప్పాడంటే..చేస్తాడంతే అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న ప్రదర్శిస్తున్న అభిమాని



ఒంగోలు చర్చి సెంటర్‌లో బాలినేని అభిమానుల కోలాహలం



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొండపిలో విజయం తథ్యం

- కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలి
- మంత్రి ఆదిమూలపు సురేష్



జరుగుమల్లి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుంది..గెలుపు నల్లేరు మీద నడక లాంటిదే అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మంచి వ్యక్తి జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్లాయని, ఓటర్లు మనల్ని ఆశీర్వదిస్తారని అన్నారు. జరుగుమల్లిలో మంగళవారం వైఎస్ఆర్ సీపీ కార్యకర్తల సమావేశానికి మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచులు విజయ దుందుభి మోగించామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, జగనన్న పాలన చూశామన్నారు. ప్రతి పక్షాలు అలవి కాని హామీలతో వస్తాయన్నారు. వారు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని చెప్పారు. వారిని నమ్మరాదన్నారు. జగనన్న ప్రజలతో మాత్రమే పొత్తు పెట్టుకున్నారని.. వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని ప్రతి పక్షాలు వస్తున్నాయి గమనించాలన్నారు. అవాస్తవాలను పదే పదే చూపిస్తూ పచ్చ మీడియా పక్కదోవ పట్టిస్తోందన్నారు.

అందరినీ కలుపుకొని పోతా..

ప్రతి కార్యకర్తని, నాయకుడిని అందరినీ కలుపుకొని పోతానని మంత్రి ఆదిమూలపు సురేష్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సంక్షేమ ఫలాలు, పార్టీలకతీతంగా అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిగా పని చేయాలన్నారు. మన సమష్టి కృషితో గెలిచి పూర్వ వైభవం తీసుకొద్దామని, విభేదాలు పక్కన పెడదాం అన్నారు. ప్రతి గ్రామానికి వచ్చి రాబోయే రోజుల్లో చర్చించుకుందాం, నాయకులు వారు చేసిన సేవలు గుర్తించి ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వనున్నట్లు మంత్రి సురేష్ తెలిపారు. పార్టీని నిలబెట్టిన వారి బాధలు తెలుసుకొని అందరికీ సేవలు అందిస్తామని చెప్పారు. జగనన్న పంపిన ఏకలవ్య శిష్యుడిగా వచ్చానని.. నేను వలస పక్షిని అయితే మీరు జైలు పక్షి అని చంద్రబాబుని ఎద్దేవా చేశారు. సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు తీసుకొని సరిదిద్దుకుంటామన్నారు. కొండపి గెలుపు కోసం బాలినేని శ్రీనివాసులరెడ్డి, ముఖ్యమంత్రి జగనన్న కొండపికి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో జరుగుమల్లి వైఎస్సార్ సీపీ కన్వీనర్ బత్తిన మదన మనోహరరావు, మండల జేసీఎస్ కన్వీనరు తాటికొండ రామచంద్రరావు, మాజీ జెడ్పీటీసీ జడా రిచర్డ్స్, నందనవనం సింగిల్ విండో అధ్యక్షుడు కొమ్మాలపాటి మధు, వైస్ ఎంపీపీ పులి బిక్షాలు, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు దుంపా అనిల్ కుమార్ రెడ్డి కొండూరి ప్రశాంత రెడ్డి, చాగంటి ప్రసాద్ పలువురు మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ప్రభుత్వం 'ఆసరా'

- జిల్లాలో 36,769 స్వయం సహాయక సంఘాలకు రూ.280.10 కోట్లు జమ
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మహిళలకు చెక్ అందజేస్తున్న మంత్రి, కలెక్టర్

ఒంగోలు అర్బన్: వైఎస్ఆర్ ఆసరా పథకంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించి ఆసరాగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి అనుబంధంగా జిల్లా స్థాయిలో ప్రకాశం భవనంలో నిర్వహించారు. దీనిలో మంత్రితో పాటు కలెక్టర్ దినేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. దీనిలో భాగంగా లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు పాలన అందిస్తూ అర్హులైన అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నాల్గవ ఏడాది ఈ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూత అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఈ పథకం కింద నాలుగు విడతల్లో రాష్ట్ర స్థాయిలో రూ.25,571 కోట్ల ఆర్థిక సహాయాన్ని స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను కూడా వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెల్లించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నీ విధాలా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడతలో భాగంగా జిల్లాలో 36,769 స్వయం సహాయక సంఘాల్లోని 3,59,566 మంది మహిళలకు రూ.280.10 కోట్లు వారి ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. మూడు విడతల్లో రూ.839.77 కోట్లను అందజేసినట్లు తెలిపారు. నాల్గవ విడతతో కలిపి మొత్తం రూ.1119.87 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు ఈ నగదును ఉపయోగించుకుని వారి జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుట్ల రవిబాబు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు నాలుగు జిల్లాల ఆక్వా రైతుల సమావేశం

ఒంగోలు సెంట్రల్: చిన్న, సన్నకారు ఆక్వా రైతులు రొయ్యల సాగులో వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టాల బారిన పడుతున్న నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు ఓరియంటల్ అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీలు ముందుకు వచ్చినట్లు జిల్లా మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు చెన్నైకి చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్ వాటర్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు డీఎల్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన ఆక్వా రైతులు, మత్స్య శాఖాధికారులు, సీఐబీఏ శాస్త్రవేత్తలు, ఇన్సూరెన్సు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అంజలి కూడా పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి ఆక్వా రైతులు పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.

నేడు జిల్లాలో ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్ పర్యటన

ఆంధ్రప్రదేశ్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం బుధవారం జిల్లాలో పర్యటిస్తారని రొయ్యల రైతు సంఘం అధ్యక్షుడు దుగ్గినేని గోపినాథ్ తెలిపారు. ఉదయం ఒంగోలులో డీఎల్‌డీఏ కార్యాలయంలో నిర్వహించే నాలుగు జిల్లాల రొయ్యల రైతుల సదస్సులో పాల్గొంటారని, అనంతరం టంగుటూరు మండలం అనంతవరం గ్రామంలో రొయ్యల రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ జేడీ, అధికారులు పాల్గొంటారని ఒక ప్రకటనలో తెలిపారు.

పంచాయతీలకు నిధుల వెల్లువ

- జిల్లాకు రూ.37.58 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల
- జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు

మార్కాపురం: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ఈ నిధులను రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడత బేసిక్ గ్రాంటు కింద రూ.4,95,30,264, టైడ్ గ్రాంట్ కింద రూ.17,22,25,034 మొత్తం 22,17,55,298 రూపాయలు కేటాయించారు. రెండో విడత బేసిక్ గ్రాంటుకింద రూ.14,95,54,568, టైడ్ గ్రాంట్ కింద రూ.22,62,95,041 మొత్తం రూ.37,58,49,609 కేటాయించారు. దీంతో మొదటి విడత వడ్డీ తాలూకు మొత్తం రూ.34,83,112 అన్ని గ్రామ పంచాయతీ ఖాతాకు జమయ్యాయి.

ఊపందుకోనున్న అభివృద్ధి పనులు

ఈ నిధులతో జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. బేసిక్ గ్రాంటుతో రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు, పంచాయతీ భవనాల నిర్మాణాలు, మరమ్మతులు, ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణ, సీసీ చార్జీల బకాయిలు చెల్లిస్తారు. టైడ్ గ్రాంటు నిధులతో పారిశుద్ధ్య నిర్వహణ, క్లాప్ మిత్ర వేతనాలు, తాగునీటి సరఫరా నిర్వహణకు నిధులను ఖర్చు చేస్తారు. ఇంకా గ్రామ పంచాయతీల్లో పనులు చేసి ఎం బుక్కులు చేసిన వాటికి చెల్లింపులు కూడా చేస్తారు.



వేములకోట సచివాలయ భవనం



నిధులు సద్వినియోగం చేసుకోవాలి


15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులను ఖర్చుచేయాలి. ప్రధానంగా తాగునీటి అవసరాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

నారాయణరెడ్డి
జిల్లా పంచాయతీ అధికారి

మండలం పేరు	బేసిక్ గ్రాంట్(రూ.)	టైడ్ గ్రాంట్(రూ.)	మొత్తం(రూ.)
అర్థవీడు	38,91,202	1,19,74,348	1,58,65,550
బేస్తవారిపేట	41,89,638	51,31,834	93,21,472
సీఎస్‌పురం	45,80,215	1,25,70,763	1,71,50,978
చీమకుర్తి	40,04,770	47,42,015	87,46,785
కంభం	38,04,205	31,65,342	69,69,547
దర్శి	45,80,468	72,37,998	1,18,18,466
దొనకొండ	42,45,269	75,00,258	1,17,45,527
దోర్నాల	42,82,604	1,32,65,923	1,75,48,527
గిద్దలూరు	39,80,751	49,12,539	88,93,290
హెచ్‌ఎంపాడు	29,13,543	64,79,526	93,93,069
కనిగిరి	43,44,523	86,76,298	1,30,20,821
కొనకనమిట్ల	43,82,892	80,31,489	1,24,14,381
కొమరోలు	34,03,054	47,82,066	81,85,120
కొండపి	28,81,710	38,00,895	66,82,605
కొత్తపట్నం	39,63,039	37,61,983	77,25,022
కురిచేడు	35,47,506	59,04,521	94,52,027
మద్దిపాడు	41,36,175	38,22,299	79,58,474
మార్కాపురం	40,00,737	58,19,236	98,19,973
మర్రిపూడి	4,94,157	66,73,510	1,01,67,667
ముండ్లమూరు	47,41,170	64,48,385	1,11,89,555
ఎన్.జి.పాడు	49,88,269	48,30,202	98,18,471
ఒంగోలు	18,71,742	21,49,349	40,21,091
పీసీపల్లి	33,77,016	68,08,811	1,01,85,827
పామూరు	53,08,858	75,82,216	1,28,91,074
పెద్దారవీడు	5,45,680	49,52,461	84,98,141
పొదిలి	24,86,263	41,81,318	66,67,581
పొన్నలూరు	36,87,221	57,47,702	94,34,923
పుల్లలచెరువు	43,71,441	53,53,713	97,25,154
రాచర్ల	31,64,847	61,12,912	92,77,759
సింగరాయకొండ	50,18,562	31,89,016	82,07,578
ఎస్ఎన్‌పాడు	33,44,389	34,97,324	68,41,713
తాళ్లూరు	38,99,445	2,16,157	81,15,602
టంగుటూరు	49,55,187	46,44,208	95,99,395
తర్లుపాడు	30,35,935	52,30,668	82,66,603
త్రిపురాంతకం	52,30,969	71,28,650	1,23,59,619
వెలిగండ్ల	32,21,280	60,64,702	92,85,982
వై.పాలెం	52,00,204	59,35,151	1,11,35,355
జరుగుమల్లి	34,79,630	39,69,250	4,48,880
మొత్తం	14,95,54,566	22,62,95,041	37,58,49,607

రూమ్ వార్..!

- జిల్లా వైద్యశాలలో వైద్యాధికారుల మధ్య రూమ్ కోసం రగడ
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు



రూంకు వేసిన రెండు తాళాలు

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాలలో రూము కోసం ఇద్దరు వైద్యాధికారుల మధ్య రగడ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వరకూ వెళ్లింది. జిల్లా వైద్యశాల ప్రారంభంలో కొన్ని రూములను మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు కేటాయించారు. అందులో డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో పాటు సిబ్బంది విధులు నిర్వరిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వైద్యశాలకు రెండురోజుల క్రితం ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లను నియమించారు. వారికి రూంలను కేటాయించే క్రమంలో సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు కేటాయించిన రూంలను ఇవ్వాలని సూపరింటెండెంట్ కోరారు. అయితే ఇందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి అంగీకరించలేదు. కొన్నేళ్లుగా జిల్లా వైద్యశాలలోనే తమకు కేటాయించిన రూంల్లో బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని, డీఎంహెచ్‌ఓ ఆదేశాలు లేకుండా తాను ఖాళీ చేయనని ఆమె స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ఉన్న తాళాన్ని వైద్యశాల సిబ్బంది తొలగించారు. దీంతో వివాదం పెద్దదైంది. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిబ్బంది వచ్చి మళ్లీ తాళం వేయగా జిల్లా వైద్యశాల సిబ్బంది మరో తాళంవేశారు. ఈ విషయంపై వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను నూతనంగా వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్లు విధులు నిర్వర్తించేందుకు రూంలు అడిగాననీ, ఇందులో తన వ్యక్తిగత స్వార్థం లేదని చెప్పారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ తనకు ఉన్నతాధికారుల ఆదేశాలు వస్తేనే రూంలు ఖాళీ చేస్తానని, అప్పటివరకూ జిల్లా వైద్యశాలలో తమకు కేటాయించిన గదుల్లోనే విధులు నిర్వర్తిస్తానని చెప్పారు. తాళం వేసిన విషయాన్ని డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్లినట్లు డాక్టర్ పద్మావతి తెలిపారు.

బడుగుల సంక్షేమమే జగనన్న ధ్యేయం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

- వైఎస్సార్ సీపీలో చేరిన 50 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఇన్‌చార్జి తాటిపర్తి

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్ ఆధ్వర్యంలో పెద్దదోర్నాల మండలంలోని పనుకోమడుగు చెంచు గూడెం, కడపరాజుపాలెం ఎస్సీ కాలనీలకు చెందిన 50 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా స్థానిక తాటిపర్తి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ చట్టాన్ని అమలు పరిచి భూములు పంపిణీ చేసింది దివంగత నేత వైఎస్సార్ అని, ఆయన తనయుడు ఒక అడుగు ముందుకు వేసి ఆ చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారని, దీని వలన అనేక గిరిజన కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారికి బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించడంతో పాటు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేసిన ఘనత జగనన్నకు దక్కుతోందన్నారు. మంత్రి వర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీలకు స్థానం కల్పించారని, సింగరాయకొండలో ఒక కార్యకర్తగా ప్రజలకు సేవలు అందిస్తున్న తనను యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారని తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గోనా చిన్న అబ్రహం, గోనా చిన్నమునయ్య, జి.దేవదానం, జి.రంగయ్య, జి.నాగేంద్రబాబు, ఎలకపాటి కోటేష్, ముండ్ల వెంకటేశ్వర్లు, దరశనం వెంకటేశ్వర్లు, మేకల శాంసన్, మేకల చిన్నయ్య, వనపర్తి తిరుమలయ్య, జంగిలి గాలయ్య, దాసరి అంకయ్య, దాసరి గురువయ్య, దాసరి కొండయ్య, పులిచెర్ల గురవయ్య, డి.అంకయ్య, నిమ్మల శ్రీను, ఈశ్వరయ్య, కుడుముల అంకన్న, కుడుముల బయ్యన్నలకు చెందిన కుటుంబాలను తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి, జి.కాశిరామిరెడ్డి, పెద్దదోర్నాల ఉప సర్పంచ్ డి.రసూల్ పాల్గొన్నారు.

మండల నాయకులతో మాటా మంతి



బసవన్నపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: జిల్లా ఇన్‌చార్జి మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున మండల నాయకులతో మాటా మంతి నిర్వహించారు. మండలంలోని బసవన్నపాలెం గ్రామంలో పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు కార్యాలయం వద్ద ఆయన మండల నాయకులను కలిశారు. కొద్ది సేపు మాట్లాడి నాయకులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కార్యకర్తలకు అండగా నిలుస్తానని మండలంలో పార్టీ మెజారిటీని పెంచేలా పార్టీ నాయకులు తోడ్పడాలని అందరం కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ వారికి అండగా నిలుస్తానని చెప్పారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడి పాటి వెంకట్రావు, పార్టీ సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, అన్వేష్, ఎంపీటీసీ బొమ్మల దేవదాసు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి సర్పంచ్‌లు రామాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు పూనాటి చిన్న అప్పయ్య, దుడ్డు వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ద్వారా సురక్షిత బియ్యం సరఫరా



విద్యార్థులతో ఎఫ్‌సీఐ అధికారులు

ఒంగోలు సెంట్రల్: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా కేంద్ర ప్రభుత్వం సురక్షితమైన బియ్యాన్ని అందిస్తున్నట్లు ఎఫ్‌సీఐ అధికారులు పేర్కొన్నారు. కనిగిరి సీఎస్ఆర్ అగ్రికల్చర్ కాలేజీ మూడో సంవత్సర విద్యార్థులు భారత ఆహార సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ (ఆర్) విజయకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారత ఆహార సంస్థ బియ్యం సరఫరా చేయడంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్పారు. పలు రకాల పథకాల్లో బియ్యం అందిస్తున్నారని, చిన్నారులకు ఫోర్టిఫైడ్ రైస్ ఇస్తున్నట్లు చెప్పారు. క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) మేనేజర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ బియ్యం నిల్వల్లో పురుగులు పట్టకుండా ఉండేందుకు పాటిస్తున్న నివారణ చర్యలు, ఎఫ్‌సీఐ పాటిస్తున్న జాగ్రత్తలను వివరించారు. ఏజీఎం రబీంద్ర మాలిక్, సిబ్బంది, కళాశాల బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు దొనకొండ విద్యార్థి

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి.కోటేశ్వరరావు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ నెట్‌బాల్ జట్టు ఎంపికలో జి.కోటేశ్వరరావు మంచి ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కాలే నరసింహారావు తెలిపారు. ఈ నెల 25వ తేది నుంచి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కోటేశ్వరరావు పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు, షేక్.అమీర్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది కోటేశ్వరరావును అభినందించారు.

నేడు రిజిస్ట్రేషన్లపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ఒంగోలు సిటీ: జగనన్న శాశ్వత హక్కు- పేదలందరికీ ఇళ్ల పథకం ప్లాట్స్ రిజిస్ట్రేషన్లపై సచివాలయ సిబ్బందికి శిక్షణ నిర్వహించనను న్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న శాశ్వత స్థల హక్కు- పేదలందరికీ ఇళ్ల పథకంలో ప్లాట్స్ రిజిస్ట్రేషన్‌లపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణకు హాజరు కాని వారిపై ఎంపీడీఓ, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు.